స్పందన కరవు



వేలం పాటకు నోచుకోని రామకృష్ణ రైతుబజార్

- జీవీఎంసీ దుకాణాలు, మార్కెట్ల వేలం పాటపై ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు
- అధిక ధరలు నిర్ణయించటమే కారణం
- పెరిగిన ఆన్‌లైన్ వ్యాపారాలూ హేతువే



వేలం పాట జరగని పూర్ణామార్కెట్

జగదాంబ: ఈ ఏడాది జీవీఎంసీ జోన్–4 పరిధిలో వివిధ మార్కెట్లు, దుకాణాల వేలం పాట నిర్వహించింది. అయితే ఎప్పుడూ దీనికి కనిపించే అద్భుతమైన స్పందన ఈసారి మాత్రం కానరాలేదు. ప్రతి ఏటా మార్చి నాటికి జీవీఎంసీ పరిధిలో ఉన్న దుకాణాలు, కల్యాణ మండపాలు, మార్కెట్లు, ఖాళీ స్థలాలకు ఆక్షన్ నిర్వహించి ఏప్రిల్ ఒకటో తేదీనాటికి కాంట్రాక్టర్లకు అప్పగిస్తారు. అయితే ఈ ఏడాది నిర్వహించిన వేలం పాటలో ముందుగా జోన్‌లో ప్రధానమైన పూర్ణా మార్కెట్, రామకృష్ణరైతుబజార్, రెల్లివీధి మార్కెట్లకు మార్చి 27న వేలం పాట నిర్వహించారు. అయితే ధరావతు ఎక్కువ నిర్ణయించి పెట్టడం వలన పాటకు ఎవరూ ముందుకు రాలేదు. అలాగే ఈనెల 4వ తేదీన నిర్ణయించిన వేలం పాటకు కూడా ఇదే పరిస్థితి ఎదురైంది.

పాటకు నిర్ణయించిన ధరావత్తు అధికంగా ఉండడం.. పాట పాడిన తర్వాత ఆ మేరకు తిరిగి వసూళ్లు చేతికందకపోవడం వంటి కారణాల వల్ల కాంట్రాక్టర్లు పాట మధ్యలోనే వెనుదిరుగుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి.

డిపార్ట్‌మెంట్ కలెక్షన్ ఎంత..

గత ఏడాది నష్టం వాటిల్లి కాంట్రాక్టర్లు పాటను వదిలేస్తే జీవీఎంసీయే స్వయంగా వసూలు చేసింది. వాస్తవంగా ఏడాది వేలం పాట రూ.87.20 లక్షలు కాగా కాంట్రాక్టర్ డిపాజిట్‌గా తొలుత రూ.33 లక్షలు చెల్లించి పాట పాడుకున్నాడు. అయితే ఆ మొత్తం కూడా రావడం దుర్లభంగా మారడంతో అతను మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయాడు. అప్పుడు జీవీఎంసీ సెక్రటరీల ద్వారా వసూళ్లు చేసినప్పటికీ రూ. 10 లక్షలు కూడా దాటలేదు. ఈ విధంగా కాంట్రాక్టర్‌తో పాటు జీవీఎంసీకి కూడా భారీగా నష్టం వాటిల్లినట్లే.

దెబ్బ కొట్టిన కరోనా.. ఆన్‌లైన్ ట్రెండ్

వాస్తవంగా జీవీఎంసీ ఎప్పుడు మార్కెట్లకు పాట పెట్టినా కాంట్రాక్టర్లు పోటీ పడి దక్కించుకునేవారు. అయితే గత మూడు సంవత్సరాలుగా కరోనా నేపథ్యంలో వ్యాపారులు, దుకాణాల సంఖ్య బాగా తగ్గిపోయింది. వీధుల్లో ఎక్కడికక్కడ పెరిగిన వ్యాపారాలు, పుంజుకున్న ఆన్‌లైన్ బిజినెస్ వంటి వాటి వల్ల మార్కెట్లకు వినియోగదారులు రావడం బాగా తగ్గిపోయింది. ఇటీవల ఏది కావాలన్నా వినియోగదారులు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసుకుని కాలు కదపకుండానే కావలసింది దక్కించుకుంటున్నారు. గతంలో కంటే ఇప్పుడు మార్కెట్లకు వచ్చే వారి సంఖ్య కూడా తగ్గినట్లు స్పష్టమవుతోంది. ఈ పరిస్థితిలో అధిక ధరలకు మార్కెట్ల వేలాన్ని దక్కించుకున్నా చేతికి వచ్చేది లాభదాయకంగా ఉండదని కాంట్రాక్టర్లు అభిప్రాయపడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని జీవీఎంసీ పాట నిర్వహిస్తే బాగుంటుందని వారంటున్నారు.

మహిళలకు జగనన్నే ఆసరా



మహిళలకు ఆసరా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు



ఆసరా కార్యక్రమానికి హాజరైన మహిళలు

ఆసరా చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ: మహిళలకు జగనన్నే ఆసరా అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. బుధవారం జీవీఎంసీ 35వ వార్డు టర్నర్ చౌల్ట్రీ వద్ద వైఎస్సార్ ఆసరా కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ముందుగా బాబూ జగ్జీవన్‌రావుకు నివాళి అర్పించిన అనంతరం ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ మహిళల పక్షపాతి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఏ రాష్ట్రంలో కూడా ఇటువంటి నాయకుడి కోసం వినడంగానీ.. చూడడం గానీ జరగ లేదన్నారు. దక్షిణ నియోజకవర్గంలో ఉన్న 7,98,395 స్వయం సహాయక పొదుపు సంఘాల్లో 78,94,128 మంది అక్కచెల్లెమ్మలకు ఇప్పటికి మూడు విడతలుగా జగనన్న రూ. 20 కోట్లు ఆసరా పథకం కింద నిధులు జమ చేశారన్నారు. ఇప్పుడు మూడో విడతగా రూ. 6,41,989 కోట్లు జమ చేసి మహిళా పక్షపాతిగా నిరూపించుకున్నారని అన్నారు. ఈ పథకం ద్వారా మొత్తం 9 లక్షల మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ విధంగా జగనన్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు పరుస్తున్నారన్నారు. గత ప్రభుత్వం డ్వాక్రా సంఘాలను నిర్వీర్యం చేసి కేవలం ఎన్నికల సమయంలో మహిళలను మభ్యపెట్టడానికి పసుపు కుంకుమ పేరుతో మోసం చేసిందన్నారు. అనంతరం రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, మత్స్యకార చైర్మన్ కోలా గురువులు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలు అందజేసినది వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు డ్వాక్రా మహిళలెవరూ ఒక్క రూపాయి కూడా కట్టవద్దని రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేస్తే అధికారంలోకి వచ్చిన జగనన్న నాలుగు విడతలుగా రుణాలు రద్దు చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికి మూడు విడతలుగా రద్దు చేసి మాట నిలబెట్టుకున్నారన్నారు. 2024లో జరిగే సాధారణ ఎన్నికల్లో జగనన్నను గెలిపించుకునే బాధ్యత మనందరి మీద ఉందన్నారు. ఈ సందర్భంగా జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మహిళలకు వైఎస్సార్ ఆసరా జంబో చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో రెల్లికుల చైర్మన్ మధుసూదనరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, జీవీఎంసీ జోన్–4 కమిషనర్ కె.శివప్రసాద్, శ్రీవత్సవ్, ఎస్‌కేఎంఎల్ చైర్‌పర్సన్ కొల్లు సింహాచలం, కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, కోడూరు అప్పలకొండ, మాసిపోగు మేరీ జోన్స్, తోట పద్మావతి, బిపిన్‌కుమార్‌జైన్, కోడిగుడ్ల పూర్ణిమ, జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ షరీఫ్, పలు వార్డుల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు సహస్ర తులసీ దళార్చన

దాబాగార్డెన్స్: నేడు బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవాలయంలో సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఈ పూజ నిర్వహిస్తారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియ న్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

తల్లిదండ్రుల తోడ్పాటుతోనే పిల్లల వికాసం



ఇంద్రజాల ప్రదర్శనలో హరీష్ పట్నాయక్

మురళీనగర్: పిల్లల్లో మానసిక వికాసానికి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ ఎ.లక్ష్మీరెడ్డి అన్నారు. మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి అధ్యక్షతన మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం మురళీనగర్ వాకర్స్ పార్కులో బుధవారం నిర్వహించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, జాలీవాకర్ ప్రకాష్, ఎన్.బుచ్చయ్య, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శేషామణి, సనపల పుష్పలత, కోశాధికారి సీహెచ్ లక్ష్మి, పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష, ఉపాధ్యక్షులు సీహెచ్ వరలక్ష్మి, లీలానాయుడు, లలితారెడ్డి, వి.ప్రమీల , వివిధ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అలరించిన ఇంద్రజాల ప్రదర్శన: విద్యార్థుల మానసిక వికాసం, విజ్ఞానం, వినోదం కోసం ఏర్పాటు చేసిన ఇంద్రజాల ప్రదర్శన విశేషంగా అలరించింది. ఇంద్రజాలికుడు ఆర్. హరీష్ పట్నాయక్ ప్రదర్శించిన వెంట్రిలాక్విజమ్ ఆకట్టుకుంది. బాలభాను, మురళీమాధవ, జీవీఎంసీ పాఠశాలల విద్యార్థులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి రథోత్సవం



మాలధారులకు శూలాలు వేస్తున్న గురుస్వామి

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి ఏకాంత ఆలయంలో చైత్రమాస బహుళ పూర్ణిమ మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఘనంగా రథోత్సవం నిర్వహించారు. శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాలరాజు కృష్ణ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య స్వామికి అష్టోత్తర, శత కలశాభిషేకం, సహస్రనామ విభూది పుష్పాలతో అర్చనలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం ఊర్వశి జంక్షన్ నుంచి కంచరపాలెం మెట్టు కూడలి వరకు రథాన్ని ఊరేగించారు. స్వామి మాలధారులు శూలాలు ధరించి రథోత్సవంలో పాల్గొన్నారు.

జర్నలిస్ట్ చిన్న కుటుంబానికి ఆర్థిక సాయం

కంచరపాలెం: ఇటీవల మృతిచెందిన మెట్రో టీవీ వీడియో జర్నలిస్ట్ బోనుల చిన్న కుటుంబాన్ని బుధవారం సాయంత్రం రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పరామర్శించారు. ముందుగా చిన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం చిన్న భార్య ప్రియ, కుమారుడు హర్షిత్ రామ్, తల్లి లక్ష్మమ్మతో మాట్లాడారు. చిన్న కుటుంబానికి వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు రూ.65 వేల ఆర్థిక సాయం అందించారు. అంతిమ యాత్ర, పెద్ద కర్మ రోజుల్లో ఆయన తన వంతు సాయం చేశారు. ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ విశాఖ అధ్యక్షుడు ఇరోతి ఈశ్వరరావు.. మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు చిన్న కుటుంబ ఆర్థిక పరిస్థితిని వివరించారు. దీంతో మంత్రి అమర్‌నాథ్ తన వంతుగా రూ.50 వేల నగదును అందజేశారు.

పెయిందొరపేటలో మహాన్నదానం



అన్నదాన కార్యక్రమంలో ద్రోణంరాజు శ్రీవత్సవ్

దాబాగార్డెన్స్: పాతనగరం పెయిందొరపేట దూరం వారి వీధిలో గల రామాలయం వద్ద శ్రీరామనవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ సంఘ సేవకుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 46 ఏళ్లుగా ఈ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు భారీ ఎత్తున నిర్వహిస్తూ వస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు చింతపల్లి పోతురాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు సనపల రవీంద్రభరత్, సంఘ సేవకుడు పోతురాజు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉపయోగపడేలా జీవిస్తా



జాన్‌వెస్లీకి కేక్ తినిపిస్తున్న కనకరెడ్డి తదితరులు



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న జాన్‌వెస్లీ తదితరులు

జగదాంబ: రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ పుట్టిన రోజు వేడుకలు జీవీఎంసీ 35వ వార్డులో అధ్యక్షుడు కనకరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం జాన్‌వెస్లీ మాట్లాడుతూ ప్రజాసేవ కోసం ఇచ్చిన ఈ జీవితం ప్రజలకు ఉపయోగపడే విధంగా నడుచుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ మహ్మద్ షరీఫ్, రాష్ట్ర డైరెక్టర్ కనకాల ఈశ్వర్, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

33వ వార్డులో..

అల్లిపురం: రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ జన్మదినం సందర్భంగా బుధవారం సాయంత్రం 33వ వార్డులో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ప్రేమ సమాజంలోని పిల్లలకు అన్నదానం నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు రంధి గోపికృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ పార్లమెంటరీ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, స్టేట్ డైరెక్టర్ సనపల రవీంద్ర భరత్, జిల్లా బీసీ నాయకుడు మన్యాల శ్రీనివాసరావు, నగర కార్యదర్శి మేడం నారాయణరెడ్డి, ఆడారి వెంకట మహేష్, కణితి బ్రహ్మం, కొడమంచిలి శ్రీను, శివ, నీలాపు అయ్యప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9న వాల్తేర్ సిమెట్రీలో క్రీస్తు పునరుత్థాన ఆరాధన



మాథ్యూపీటర్

దాబాగార్డెన్స్: క్రీస్తు పునరుత్థాన పండగను పురస్కరించుకుని ఈ నెల 9న వాల్తేర్ సిమెట్రీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్టు సిమెట్రీ అధ్యక్షుడు జార్జిఫీడి, కార్యదర్శి మాథ్యూపీటర్ తెలిపారు. సిమెట్రీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 5 నుంచి 6 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమం ఉంటుందని, 6 నుంచి బీజేడ్‌ఎల్ క్వయర్‌చే ప్రత్యేక సంగీత కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. క్రైస్తవులు, వారి బంధువులు, ఆత్మీయుల సమాధులు సందర్శించుకుని ప్రార్థనలు, ఆరాధనలు జరిపించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రత్యేకంగా పాస్టర్లు వచ్చి బంధువులు విడిచిపోయిన వారి సమాధుల వద్ద ప్రార్థనలు నిర్వహిస్తారని తెలిపారు. క్రీస్తు పునరుత్థాన పండగను పురస్కరించుకుని సిమెట్రీ సమాధుల వద్ద పేరుకుపోయిన చెత్తా, చెదారాలు తొలగించడం జరిగిందన్నారు. ప్రస్తుతం బరియల్ గ్రౌండ్ స్థల సేకరణకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. బరియల్ గ్రౌండ్ ప్రహరీపై దైవ వాక్యాలు, పెయింట్లు, విద్యుద్దీపాలతో అలంకరించనున్నట్టు చెప్పారు. సమావేశంలో సిమెట్రీ కోశాధికారి థామస్‌పుల్లెట్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ విధానాలపై ఐక్యపోరు కొనసాగిస్తాం



మాట్లాడుతున్న ఆర్‌కేఎస్‌వీ కుమార్

సీతమ్మధార : మోదీ విధానాలపై ఐక్యపోరు కొనసాగిస్తామని, ఆయన ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ హెచ్చరించారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు కేంద్ర ప్రభుత్వం పాల్పడుతుందని.. దానిని నిరసిస్తున్నట్లు తెలియజేస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ఢిల్లీలో జరుగుతున్న ర్యాలీకి పది లక్షలకు పైగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు చేరుకున్నారని అన్నారు. ధర్నాకు ముందు మోదీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతున్న తీరును తెలియజేస్తూ కళారూపాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు యూనియన్ల నాయకులు ప్రసాద్, ఆర్.లక్ష్మణమూర్తి, యు.రాజు, శ్రీదేవి, సరస్వతి, దేవి, చినతల్లి, తోటమ్మ, రాము, వెంకటలక్ష్మి, డి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కవులు సమాజ నిర్దేశకులు

సీతంపేట: సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో కవి సమ్మేళనం జరిగింది. సాహితీవేత్త వి.ఆర్.ఎస్.సోమయాజులు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ కవులు సమాజ మార్గనిర్దేశకులు, క్రాంతదర్శులు, మానవతా మూర్తులని అభివర్ణించారు. కవుల కీర్తి వారి కావ్యాల ద్వారా తరతరాలకు నిలిచిపోతుందన్నారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ సహృదయ సాహితి కవులకు పుట్టినిల్లని, నాలుగు దశాబ్దాలుగా ఎందరో కవులు, రచయితలు తమ సంస్థ ద్వారా పరిచయమయ్యారని తెలిపారు. రచయిత కె.జి.వేణు సాహితీవేత్త కడియాల రామమోహనరావు గురించి పరి చయం చేస్తూ ప్రసంగించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, కవులు సిహెచ్.సినసూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, సోమయాజులు, నాగుల శ్రీనివాసరావు, రామతాత, కొత్తూరు రమణ, చిన సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు బాబూ జగ్జీవన్‌రామ్



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నూకాంబిక సేవా సంఘం ప్రతినిధులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి



రంగిరీజువీధిలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకట్రావు

అల్లిపురం: స్వాతంత్ర సమరయోధుడు, సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్‌రామ్ 116వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 34వ వార్డు పరిధి కొబ్బరితోటలో నూకమాంబ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మొయేటి అప్పారావు, యానంగి వేణు, చెవ్వేటి అప్పారావు, దిగుమర్తి ప్రసాద్, రాయి అప్పారావు, తెలుగుచర్ల కనకరాజు, రాయి చిన్న, తెలుగుచర్ల శ్రీను, యాణంగి శివకుమార్ తదితరులు పాల్గొని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయనను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఆయన దేశానికి చేసిన సేవను కొనియాడారు.

నియోజకవర్గంలో పలు చోట్ల

దాబాగార్డెన్స్: మాజీ ఉప ప్రధాని, మాజీ కేంద్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 116వ జయంతి కార్యక్రమం బుధవారం నియోజకవర్గ పరిధి పలు ప్రాంతాల్లో నిర్వహించారు. 36వ వార్డులో గల జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వృద్ధాశ్రమాల్లో జగ్జీవన్‌రామ్‌కు నివాళులు అర్పించారు.

36వ వార్డు రంగిరీజువీధిలో మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకట్రావు, వార్డు నాయకులు అలమండ విజయ్, కోరుకొండ సూర్యప్రసాద్ నేతృత్వంలో పార్టీ నాయకులు సీతంరాజు సుధాకర్ సహకారంతో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ముందుగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొప్పుల వెంకట్రావు మాట్లాడుతూ పేదలు, శ్రామికులు, సామాన్యులు, అణగారిని వర్గాలకు సామాజిక, ఆర్థిక సమానత్వం అందించేందుకు జగ్జీవన్‌రామ్ కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఓదూరు వేణు, శ్రీనివాసరావు, కొప్పుల భాస్కరరావు, ప్రధాన శత్రు, పాపారావు, బొడ్డేటి కిరణ్, వంగలపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి స్కూల్లో..

ఫిషింగ్ హార్బర్ రోడ్డులో గల బ్రిడ్జి స్కూల్ ఆవరణలో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు, జనశిక్షణ సంస్థాన్‌కు చెందిన మనోహర్, వి. శ్రీనివాస్, చింతాడ సూర్యం, గండి రాజకుమారి, ఝాన్సీ, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొని జగ్జీవన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు.



బ్రిడ్జి స్కూల్లో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిలో పాల్గొన్న అతిథులు

కేజీహెచ్‌లో..

మహారాణిపేట : బుధవారం కేజీహెచ్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో డాక్టర్ కె.జగదీష్‌కుమార్, ఏఆర్‌ఎంవో డాక్టర్ ఎ. విజయలక్ష్మి, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ వన్ రమణమ్మ, గ్రేడ్–2 కల్పనామౌళి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ పి.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

నవభారత నిర్మాణంలో అవిరళ కృషి చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బాబూ జగ్జీవన్‌రామ్ 116వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పంచాయితీ రాజ్ వ్యవస్థను భారతదేశంలో సంపూర్ణంగా అమలు చేశారని తెలిపారు. జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సత్య, ఎస్సీ సంఘాల నాయకులు పి. మల్లేశ్వరరావు, జోసఫ్, సత్యం, వెంకటరావు, రామారావు, సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కమిషనరేట్‌లో..

దొండపర్తి: స్వాతంత్ర్య సమరయోధుడు, స్వర్గీయ డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 116వ జయంతిని పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాడిన యోధుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ (ఎస్‌బీ) గంగాధర్, ఏడీసీపీ (ఏఆర్) కె.సుబ్రహ్మణ్యం, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కేజీహెచ్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీ శ్రీకాంత్

వాకర్స్ క్లబ్ సభ్యులకు గుర్తింపు కార్డులు

మురళీనగర్: వాకర్స్ ఇంటర్నేషనల్ పరిధిలోని వాకర్స్ క్లబ్ సభ్యులందరికీ గుర్తింపు కార్డులు జారీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎస్‌పీ రవీంద్ర ఆధ్వర్యంలో మొట్టమొదటి సారిగా క్లబ్ సభ్యులకు గుర్తింపు కార్డులు ఇస్తామన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ పరిధి 10 ఉమ్మడి జిల్లాల్లోని 1400 క్లబ్‌ల్లో సభ్యులుగా నమోదైన వారందరికీ గుర్తింపు కార్డులు అందిస్తామని చెప్పారు. ఈ కార్డులను బహుళ ప్రయోజనకరంగా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా అయ్యప్ప జన్మనక్షత్ర పూజలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: టూటౌన్ దరి శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం అయ్యప్ప జన్మనక్షత్రం ఉత్తరా నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. నీలాపు రమణారెడ్డి గురుస్వామి శిష్య బృందం, వేమన సంక్షేమ సంఘం కోర్ కమిటీ సభ్యుల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు సాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, అలంకరణ, అనంతరం స్వామివారికి పండ్లు, కాయలతో విశేషంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రాంబాయి, ఎల్‌ఏ సుకుమార్, సిబ్బంది కేఎం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఫౌండేషన్, సమాఖ్య సభ్యులు

మద్దిపాలెం: బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను పురస్కరించుకుని స్పృహ సోషల్ రీసెర్చ్ ఫౌండేషన్, సింహాద్రి అప్పన్న ప్రచార సమాఖ్య సంయుక్తంగా వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బుధవారం బహుమతులు ప్రదానం చేశాయి. ముఖ్య అతిథి ప్రొఫెసర్ టి.వి.కృష్ణమూర్తి సాంఘిక, సంక్షేమ హాస్టల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రమశిక్షణతో జీవితాన్ని నిర్మించుకోవాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ఆర్.ప్రసాద్, ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.అబ్రహం, సింహాద్రి అప్పన్న ప్రచార సమైఖ్య కార్యదర్శి సనపల నారాయణ స్వామి, వారణాసి రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.